
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

మంగళవారం 24 సెప్టెంబరు 2024 | 5

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 534 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 23: కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో అర్జీలను నాణ్యతతో పరిష్కరిం చాలని జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఆయనతోపాటు డీఆర్వో తిప్పే నాయక్, సీపీవో త్రినాథ్ ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోపు పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై 534 అర్జీలు అందాయన్నారు. ఈనెల 28న శనివారం పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సత్యనారాయణ, డీపీఎం లావణ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 75 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కాకినాడక్రైం, సెప్టెంబరు 23: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు జిల్లావ్యాప్తంగా 75మంది ఫిర్యాదుదారులు హాజరై తమ గోడును ఎస్పీకి విన్నవించారు. ఆయన సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదు సమ్మతమైనదైతే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామ కోటేశ్వరరావు, సీఐ ఎస్.గౌరీశంకర్, మహిళా ఎస్ఐ లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

7

కలలు.. కల్లలయ్యాయి!

మెడికోలను చిదిమేసిన జలఖడ్గం

కలలు కల్లలయ్యాయి.. ఆశలు ఆవిరయ్యాయి.. చిన్నపాటి నిర్లక్ష్యం.. భవిష్యత్‌లో ఎంతో మందికి ఊపిరిపోయాల్సిన వారి ఊపిరినే తీసేసింది.. కుటుంబీకులకు తీరని శోకం మిగిల్చింది.. నిన్నటి వరకూ మా అమ్మాయి డాక్టర్ చదువుతుందంటూ ఎంతో గర్వంగా చెప్పుకున్న ఆ తల్లిదండ్రుల నోటమాట రావడంలేదు.. కళ్ల నుంచి ఉబికి వచ్చే కన్నీళ్లు ఆగడంలేదు.. తమ కళ్లెదుటే కొట్టుకుపోయారని.. ఎక్కడో ఒక చోట నుంచి తిరిగి వస్తారని ఆశగా ఎదురుచూసిన స్నేహితులకు కన్నీరే మిగిలింది.. తాము చూస్తుండగానే ఆనందంగా వాగులో దిగి గల్లంతైన ముగ్గురిలో ఇద్దరు విగతజీవులుగా కనిపించడాన్ని తట్టుకోలేకపోతున్నారు.. వెళ్లిపోదాం లేవండిరా అంటూ స్నేహితుల మృతదేహాలను పట్టుకుని వాళ్ల వెంట వచ్చిన స్నేహితులంతా కన్నీటిపర్యంతమయ్యారు. మారేడుమిల్లి జలతరంగణి వాగు వద్ద క్షణాల్లో పెరిగిన నీటి ఉధృతికి ముగ్గురు ఆశ్రం మెడికల్ కాలేజీ విద్యార్థులు గల్లంతైన ఘటన విదితమే. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు లభ్యం కావడంతో ఆ ప్రాంతమంతా హృదయవిదారకంగా మారింది.. తోటి స్నేహితులు.. విద్యార్థినుల బంధువులను ఆపడం ఎవరి వల్లా కాలేదు.. మరొకరి ఆచూకీ ఇంకా లభించాల్సి ఉంది.



గల్లంతైన వారి ఆచూకీ కోసం సోమవారం వాగులో వెతుకుతున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది







అన్నవరంలో.. అవినీతి!



దేవస్థానంలో నెయ్యికి 'నోట్ల' తడి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అన్నవరం దేవస్థానంలో వినియోగించే నెయ్యి నాణ్యతపై ఆలయ అధికారుల ఉదాసీనత అనేక అనుమానాలకు తావిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అడ్డగోలు కంపెనీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టు కట్టబెట్టిన ఆలయ అధికారులు అసలు నాణ్యతను పట్టించుకోలేదు. అంతేకాదు.. నెయ్యి నాణ్యతపై జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అనుమతులు లేవు. తాజాగా తిరుపతి లడ్డూలో వినియోగించి నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని తేలిన నేపథ్యంలో అన్నవరంలో నెయ్యి నాణ్యతపై ఆరా తీస్తే అనేక చేదు నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అన్నవరం నెయ్యిని సైతం ప్రక్షాళనచేయాలని నిర్ణయించింది. కమీషన్లకు కక్కుర్తి పడి అనామక కంపెనీకి కట్టబెట్టిన నెయ్యి కాంట్రాక్టును పూర్తిగా తొలగించాలని భావిస్తోంది. ఇక ప్రభుత్వ డెయిరీ నుంచే నేరుగా నెయ్యి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో విజయ డెయిరీని రంగంలోకి దించబోతున్నారు. ప్రస్తుత నెయ్యి నాణ్యత నిగ్గుతేల్చడానికి శాంపిళ్లను బెంగళూరు ల్యాబ్‌కు తరలించారు.

నెయ్యి పేరుతో నోట్లు మింగుడు...

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అన్నవరం దేవస్థానం ఎంతో ప్రఖ్యాతి చెందింది. ఏటా లక్షల్లో భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి వస్తారు. ఒక్క ప్రసాదమే ఏటా రెండు కోట్ల ప్యాకెట్లు అమ్ముడవుతాయి. ఇక్కడి ప్రసాదం అంటే భక్తులకు అంత ప్రీతి. అందుకే దేవస్థానంలో ప్రసాదం తయారీకి ఏటా 18 లక్షల కిలోల నెయ్యి అవసరం ఉంటుంది. కానీ అధికారులు ఈ నెయ్యిలో కోట్లలో నోట్ల వేట సాగించారు. ఆరు నెలలకోసారి ఒక్కొక్క కాంట్రాక్టర్ నుంచి నెయ్యి సరఫరా జరగాల్సి ఉంటే.. గత వైసీపీ ప్రభుత్వంలో ఓ అనామక కంపెనీ నుంచి ఏకంగా రెండేళ్ల పాటు అధికారులు నెయ్యి కొనుగోలు చేశారు.అసలు ఆ కంపెనీకి అంత నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం లేకపోయినా కాంట్రాక్టు కట్టబెట్టేశారు. ఇదే కాంట్రాక్టరు పక్కనే సింహాచలం దేవస్థానానికి కిలో నెయ్యి రూ.344కి సరఫరా చేస్తే అన్నవరం దేవస్థానానికి ఏకంగా రూ.538కి విక్రయించారు. ఈ రెండేళ్లలో సదరు కాంట్రాక్టర్‌కు సింహాచలంతో పోల్చితే ఏకంగా రూ.7.80 కోట్ల వరకు గిట్టేశాడు. అంతేకాదు తాజాగా మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. దేవస్థానానికి సరఫరా అయిన నెయ్యిని నిబంధనల ప్రకారం ఆలయ అధికారులు జిల్లా ఆహార కల్తీ నియంత్రణ శాఖ ద్వారా తనిఖీ చేయించాలి. నెయ్యి వచ్చిన వెంటనే ఆ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. అధికారులు వచ్చి నెయ్యి నాణ్యత పక్కాగా ఉందని ధ్రువీకరించిన తర్వాతే వినియోగించాలి.కానీ దేవస్థానం అధికారులు అసలు ఈ పని చేయలేదు.ఆ శాఖతో సంప్రదింపులు చేయ లేదు. నెయ్యి సరఫరా అయిన ప్రతిసారీ తనిఖీ చేయిస్తే ఎక్కడ నాణ్యత బయటపడి తమ బండారం బట్టబయలు అవుతుందోనని భయంతో అడ్డగోలుగా వ్యవహరించారు. పూర్తిగా నిబంధనలకు తూట్లు పొడిచారు. అనామక నెయ్యి సరఫరా కాంట్రాక్టరు తనకు అనుకూలంగా తెచ్చుకున్న దొంగ నాణ్యత సర్టిఫికెట్‌నే నమ్మి నెయ్యి కొనుగోలు చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అసలే ఆరు నెలలకోసారి మారాల్సిన కాంట్రాక్టర్ మారకపోవడం, ఇతర ఆలయాలతో పోల్చితే అధిక చెల్లింపులు, పైగా నెయ్యికి తనిఖీలు చేయించకపోవడం వెనుక ఎన్ని కోట్ల లో కమీషన్లు చేతులు మారాయనేదానిని రుజువు చేస్తోంది.



- నెయ్యి నాణ్యతపై అనుమతులు నిల్
- జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ తనిఖీల్లేవ్
- నేటికీ అనామక కంపెనీ నుంచే నెయ్యి
- కాంట్రాక్టర్‌కు అడ్డగోలు సహకారం
- తిరుపతి ఘటనతో మేల్కొన్న ప్రభుత్వం
- నెయ్యి సరఫరాలో సమూల మార్పులు
- ప్రస్తుత కంపెనీని తప్పించాలని నిర్ణయం
- వచ్చే నెల నుంచి కొత్త కాంట్రాక్టర్ రాక
- ఇకపై విజయ డెయిరీ నెయ్యి కొనుగోలు?
- సింహాచలానికి విశాఖ డెయిరీ నెయ్యి
- డిప్యూటీ సీఎం పవన్‌తో చర్చలు
- అన్నవరం నెయ్యి శాంపిళ్లు బెంగళూరుకు
- మరో 20 రోజుల్లో రానున్న నివేదిక

ఇకపై సమూల మార్పులు..

తిరుపతి లడ్డు తయారీలో గత వైసీపీ ప్రభుత్వం జంతు కొవ్వులు కలిసిన నెయ్యిని వినియోగించిన ఘటన బట్టబయలు కావడంతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. అన్నవరం దేవస్థానంలోను ఇకపై నెయ్యి నాణ్యత పెంచాలని నిర్ణయించింది. వైసీపీ హయాం నుంచి అడ్డగోలుగా కొనసాగుతున్న ప్రస్తుతం రైతు డెయిరీ కాంట్రాక్టర్‌కు నెయ్యి సరఫరా గడువు ఈనెలతో ముగుస్తోంది. తిరిగి వచ్చే నెల నుంచి మరో కొత్త కాంట్రాక్టర్ రంగంలోకి దిగుతున్నారు. ఈలోపే నెయ్యి నాణ్యతపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతోంది. అందులో భాగంగా ప్రభుత్వ విజయ డెయిరీ నుంచి మొత్తం నెయ్యిని కొనుగోలు చేయాలని దాదాపు నిర్ణయానికి వచ్చింది. ఈ మేరకు జిల్లా మంత్రి అయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి విజయ నుంచి నెయ్యి కొనుగోలు ప్రతిపాదన తీసుకువెళ్లారు. అదే సమయంలో సింహాచలం దేవస్థానానికి అన్నవరం ఆలయానికి సరఫరా చేస్తున్న కాంట్రాక్టరే నెయ్యి సరఫరా చేస్తుండడంతో అయన్ను తప్పించి విశాఖ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని సోమవారం నిర్ణయం తీసుకున్నారు.ఈ నేపథ్యంలో పవన్ దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకువెళ్లబోతున్నారు. తద్వారా విజయ, విశాఖలో ఏదనేది నిర్ణయించనున్నారు. విజయ డెయిరీ వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయి. అన్నవరం దేవస్థానంలో జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారులు ఆదివారం తనిఖీలు చేసి నాలుగు నెయ్యి శాంపిళ్లు సేకరించారు. నాణ్యతను నిగ్గు తేల్చడానికి హైదరాబాద్‌లోని స్టేట్ ల్యాబ్, మరింత లోతైన విశ్లేషణకు బెంగళూరులోని కేంద్ర ల్యాబ్‌కు పంపించారు. 20 రోజుల్లో వీటికి సంబంధించి పూర్తిస్థాయి నివేదికలు రానున్నాయి.

కాకినాడ కలెక్టర్ ఆగ్రహం..

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ నెయ్యి నాణ్యత విషయమై ఆగ్రహంగా ఉన్నారు. ఇప్పటికే జిల్లా ఆహారకల్తీ నియంత్రణశాఖ అధికారులను పిలిపించి మాట్లాడగా అసలు నెయ్యి నాణ్యతపై ఏ రోజూ తమ ద్వారా తనిఖీలు జరగలేదనే విస్తుగొలిపే వాస్తవాలు బయటకు వచ్చాయి. తమకు దేవస్థానం నుంచి అసలు ఎప్పుడూ సమాచారం లేదని కలెక్టర్‌కు వివరించారు. ఒకరకంగా ఇది పూర్తిగా నిబంధనల ఉల్లంఘనే అని తేల్చిచెప్పాలి. తిరుపతి ఘటన నేపథ్యంలో ఇకపై ఆలయానికి వచ్చే నెయ్యిని ఆహార కల్తీ నియంత్రణశాఖ అనుమతించి పక్కాగా ఉందని నిర్ధారించిన తర్వాతే వినియోగించేలా జిల్లా ఆహార కల్తీ నిరోధక శాఖ ఆలయ ఈవోకు రాతపూర్వకంగా లేఖ రాయబోతోంది.

ఆక్రమణల కూల్చివేత



కాకినాడ జ్యోతుల మార్కెట్‌లో అక్రమంగా నిర్మించిన దుకాణాలను ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చివేస్తున్న అధికారులు

- కాకినాడ జ్యోతుల మార్కెట్‌లో అక్రమంగా నిర్మించిన షాపులు తొలగింపు
- వైసీపీ హయాంలో అధికార బలంతో అక్రమ నిర్మాణాలు
- కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తొలగింపు ప్రక్రియ
- మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అనుచరులకు షాక్

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 23: కాకినాడ నగరంలోని జ్యోతుల మార్కెట్‌లో గత వైసీపీ ప్రభుత్వంలో అధికార బలంతో ఆక్రమణ చేసి నిర్మించిన మూడు దుకాణాలను నగరపాలకసంస్థ అధికారులు కూల్చివేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అనుచరులకు షాక్ మీద షాక్ తగులుతోంది. కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ కె.హరిదాస్ ఆధ్వర్యంలో ఏసీపీ నాగశాస్త్రులు, టీపీఎస్‌లు చాందిని, రామ్మోహన్, రమణ ఇతర సిబ్బంది పోలీసుల సహకారంతో సోమవారం అక్రమ నిర్మాణాలను తొలగించారు. వీటితోపాటు ఈ మార్కెట్‌లో నిర్మించిన దుకాణ సముదాయాల్లో వ్యాపారులు ప్రధాన రహదారిని ఆక్రమిస్తూ ట్రాఫిక్ ఇబ్బందులు కలగజేస్తున్నారని, ఎవరికి వారుగా స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని, లేనిపక్షంలో వాటిని తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో వ్యాపారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకున్నారు. ప్రధాన రహదారిని, డ్రైనేజీని ఆక్రమించి నిర్మించిన మూడు దుకాణాలను ఎక్స్‌కవేటర్ ద్వారా అధికారులు తొలగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే అధికారబలంతో ఆక్రమించిన స్థలాలను నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించుకుంటూ వస్తున్నారు.

ఉమ్మడి జిల్లా పరిధి రెవెన్యూశాఖలో పెద్దఎత్తున బదిలీలు

- 28మంది డిప్యూటీ తహసీల్దార్లు
- 19మంది సీనియర్ అసిస్టెంట్లు
- 57మంది వీఆర్వోలు బదిలీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 23: సాధారణ బదిలీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాల్లో పరిధిలో రెవెన్యూశాఖలో పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. ఈ మేరకు కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ఉత్తర్వులను వెలువరించారు. 28మంది డిప్యూటీ తహసీల్దార్లు బదిలీ అయ్యారు. 19మంది సీనియర్ అసిస్టెంట్లు, 8మంది జూనియర్ అసిస్టెంట్లు, 57మంది వీఆర్వోలను బదిలీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు నాగబాబు, చిరంజీవిబాబు, భద్రరావు, సతీష్‌కుమార్‌రెడ్డి, రాజులకు కాకినాడ జిల్లాకు బదిలీ చేశారు. సుధాకర్‌రావు, సత్యనారాయణ, చైతన్యబాబు, సుబ్బారావులను తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేశారు. వెంకటేశ్వరరావును కోనసీమ జిల్లాకు బదిలీ చేశారు. కాకినాడ జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లుగా పనిచేస్తున్న దుర్గాప్రసాద్, పద్మావతి, పవన్ కుమార్, రామచంద్రారెడ్డి, కార్తీక్, అఖిల్, ఆనంద్, లక్ష్మీప్రసన్నలను అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు బదిలీచేశారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ నోడల్ అధికారిగా వ్యవహరించి ఈ బదిలీలను చేశారు.

కాకినాడ కార్పొరేషన్‌లో బదిలీల పర్వం

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 23: కాకినాడ నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల్లో భారీస్థాయిలో బదిలీలు జరిగాయి. ఇప్పటికే అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ బదిలీ కాగా ఇప్పుడు ఇంజనీరింగ్ సెక్షన్, టౌన్‌ప్లానింగ్, సెక్రటరీ బదిలీలతో కార్పొరేషన్‌లో భారీస్థాయిలో ప్రక్షాళన చేపట్టారు. సెక్రటరీ ఎం.ఏసుబాబు తాడేపల్లిగూడెం కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హిందూపురం మున్సిపాల్టీ కమిషనర్ బి.శ్రీకాంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో ఎస్ఈగా పనిచేస్తున్న పి.సత్యకుమారి విజయవాడ నగరపాలక సంస్థ ఎస్ఈగా బదిలీ అయ్యారు. స్మార్ట్‌సిటీ ఎస్ఈ(ఇన్‌చార్జి) పి.వెంకటరావును టిడ్కోకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో విశాఖపట్నంలో ఈఈగా పనిచేస్తున్న ఎస్.మత్స్యరాజును నియమించారు. ఈఈ ఎంవీకే మాధవి రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఈఈగా బదిలీచేశారు. ఆమె స్థానంలో విశాఖపట్నంలో పనిచేస్తున్న ఈఈ పి.కామేశ్వరరావు ను నియమించారు. టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ కె.హరిదాసును విశాఖపట్నం జీవీఎంసీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ఏసీపీ వి.వరహాలబాబు బాధ్యతలు చేపట్టనున్నారు.

జిల్లా పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీలు బదిలీలు

జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు భారీగా బదిలీలు జరిగాయి. ఈ మేరకు సోమవారం కలెక్టర్ బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. గ్రేడ్-1 కార్యదర్శులు 52మంది, గ్రేడ్-2 కార్యదర్శులు 49మంది, గ్రేడ్-3 కార్యదర్శులు 7మంది, గ్రేడ్-4 కార్యదర్శులు 33మంది బదిలీ అయ్యారు.

ప్రతిభకు ఐదేళ్ల ధీమా.. ఎన్ఎంఎంఎస్

- ఏడాదికి రూ.12వేల చొప్పున మొత్తం రూ.60వేల స్కాలర్‌షిప్
- దరఖాస్తుకు ఆఖరు తేదీ ఈ నెల 24(నేడే)
- ఇప్పటికే రెండు దఫాలు గడువు పొడిగింపు
- పరీక్ష తేదీ డిసెంబరు 8

సామర్లకోట, సెప్టెంబరు 23: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కేంద్రం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కీమ్ (ఎన్ఎంఎంఎస్) పథకాన్ని 2008లో ప్రారంభించింది. పరీక్ష రాసేందుకు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులు. ఈ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన వారికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఏటా రూ.12 వేల చొప్పున ఉపకారవేతనాన్ని ఐదేళ్లపాటు కేంద్రప్రభుత్వం నేరుగా విద్యార్థి బ్యాంక్ ఖాతాకే జమచేస్తుంది.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు అర్హతలు

- రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు అర్హులు.
- ఏడో తరగతిలో 55శాతం మార్కులు సాధించిన వారు అర్హులు
- తుది ఎంపిక సమయానికి 8వతరగతిలో 55శాతం మార్కులు రావాలి
- అభ్యర్థి కుటుంబ వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ.3లక్షల50వేల లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులు.

పరీక్షా విధానం

ప్రతిభావంతులను ఎంపిక చేయడానికి రాత పరీక్షను నిర్వహిస్తారు. దీనిలో రెండు విభాగాల్లో పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఎ.మ్యాట్(మెంటల్ ఎబిలిటీ టెస్ట్), బి.శాట్(స్కాలర్‌షిప్ ఆప్టిట్యూడ్ టెస్ట్). పరీక్ష తేదీ 2024, డిసెంబరు 8.

పరీక్ష ఫీజు.. రిజర్వేషన్ విధానం

ప్రతి విద్యార్థి పరీక్ష ఫీజు రూ.100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 చెల్లించాల్సిఉంటుంది. ఎస్సీ-15శాతం, ఎస్టీ-6శాతం, బీసీ(ఏ)-7శాతం, బీసీ(బీ)-10శాతం, బీసీ(సీ)-1శాతం, బీసీ(డీ)-7శాతం, బీసీ(ఈ)-4శాతం, పీహెచ్-3శాతం, ప్రాతిపదికన ఎంపిక చేస్తారు.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా ఆగస్టు 8 నుంచి స్వీకరిస్తున్నారు. ఇప్పటికే గడువు రెండు దఫాలు పొడిగించగా తాజాగా ఈనెల 24తో ముగియనుంది. పరీక్ష రుసుము ఎస్‌బీఐ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలి.

జిల్లా కలెక్టర్‌తో ఉద్యోగ సంఘాల భేటీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 23: కలెక్టర్ ఛాంబర్‌లో ఉద్యోగ జేఏసీ నేతలు, ఉద్యమ జేఏసీ నేతలతో జిల్లా కలెక్టర్ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకుగురైన డ్రైవర్ సుబ్రహ్మణ్యం విషయంలో ఆయన తల్లిదండ్రులకు అందాల్సిన రాయితీలు నేటికీ న్యాయం జరగలేదని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగ జేఏసీ మాజీ అధ్యక్షుడు బూరిగ ఆశీర్వాదం, జేఏసీప్రస్తుత అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, దళిత నేతలు ధనరాశి శ్యాంసుదర్, తాడి బాబ్జి, శివకుమార్, కొండబాబు, సతీష్, సామాజిక న్యాయ సాధన సమితి ప్రధాన కార్యదర్శి నవీన్‌రాజ్, జిల్లా రెవెన్యూ సంఘం జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కాలుష్య నియంత్రణ మండలి ఈఈ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 23: సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమితులైన ఎంబీఎస్ శంకర్‌రావు సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

సివిల్ సప్లయిస్ డీఎంగా నాయక్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 23: సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్‌గా ఎం.దేవులనాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది. ఆయన మన్యం జిల్లా నుంచి బదిలీపై వస్తున్నారు. ఇప్పటివరకు ఇక్కడ జిల్లా మేనేజర్‌గా ఎఫ్ఏసీగా బాధ్యతలు నిర్వహించిన బాలసరస్వతిని సొంత విభాగమైన సివిల్ సప్లయిస్ అకౌంట్స్ అసిస్టెంట్ మేనేజర్‌గా కొనసాగాలని ఆదేశించారు.

మెయిన్‌లో

విద్యార్థినికి డిప్యూటీ సీఎం పవన్ ఆర్థిక సాయం

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పై కేసు
- ఎమ్మెల్యే పంతం నానాజీ ఒకరోజు ప్రాయశ్చిత్త దీక్ష
- కాకినాడ జీజీహెచ్‌వద్ద ఏపీజీడీఏ ఆధ్వర్యంలో ఆందోళన

'విషాద' కేంద్రాలు!



- మన్యం పర్యాటకంలో తరచూ ప్రమాదాలు
- వాగులు, జలపాతాల్లో దిగి మృత్యువు ఒడిలోకి
- ఆనందంతో వచ్చి.. కన్నీటితో వీడ్కోలు
- పర్యాటకుల భద్రత సైతం గాలికి
- ప్రమాదకర ప్రాంతాల్లో వీక్షణకే పరిమితం చేస్తే కొంత మెరుగు

(రంపచోడవరం)

మన్యంలో అడ్డతీగల మండలం పింజరికొండ, రంపచోడవరం మండలం సీతపల్లి వాగు, భూపతిపాలెం ప్రాజెక్టు, మారేడుమిల్లి మండలం పాములేరు వాగు, ఇపుడు కొత్తగా జలతరంగిణి జలపాతం, అటుపైన ఘాటీలో మరొక జలపాతం ఉండగా చింతూరు మండలం మోతుగూడెం జలపాతం, సోకులేరు వాగు వీటి అన్నిటికీ మించి గుడిసె హిల్ స్పాట్... ఇలా అనేక ప్రకృతి ఇచ్చిన పర్యాటక కేంద్రాలు రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా అటవీశాఖ నిర్వహిస్తున్న ఎకో టూరిజం ప్రాజెక్టులను కేవలం ఆదాయ వనరులుగానే మార్చుకుంటు న్నారు తప్ప, అక్కడికి వచ్చే పర్యాటకుల రక్షణను మాత్రం గాలికొదిలేశారు. ఇదే పర్యాటకులకు ప్రాణగండంగా మారింది. ఎందరో యువతీ, యువకులు వాగుల్లో పడి మృతి చెందారు. అయినాగానీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని భారీవర్షాలు, ప్రకృతి విపత్తులరీత్యా ఐటీడీఏ, రెవెన్యూశాఖ కొంతకాలంపాటు నిషేధం విధించాయి. కానీ పర్యాటకులు ఈ నిషేధాన్ని ఉల్లంఘించి మరీ మన్యంలోకి వస్తున్నారు. దీనికితోడు ఆయా కేంద్రాల వద్ద కూడా పోలీసు పహారా లోపించడంతో పర్యాటకులను అడ్డుకునే వారే లేకుండా పోయారు. మరోవైపు అటవీ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఎకో టూరిజం పర్యాటక కేంద్రాలను మాత్రం ఆ శాఖ కొనసాగిస్తూనే ఉంది. దీంతో అటవీశాఖ నిర్వహించే పర్యాటక కేంద్రాల్లో నిషేధం అమలులో లేనట్టే. మారేడుమిల్లి జలతరంగిణి జలపాతానికి పర్యాటకులను అనుమతిస్తూ టికెట్లను విక్రయించడమే ఆదివారం నాటి ఘటనకు కారణమైంది. ఎక్కడి నుంచో వచ్చిన మెడికల్ విద్యార్థులను నిరోధించాల్సిన అటవీశాఖ అధికారులు, టికెట్ల ఆదాయం కోసం వారిని జలతరంగిణిలోకి అనుమతించడమే ప్రమాదానికి కారణమైంది. ఈ జలతరంగిణి జలపాతం ఇటీవల భారీ వర్షాలు, వరదలతో నాచు పట్టి ఉండడంతో అక్కడ అడుగుపెడితే చాలు.. కాలికి పట్టు లేకుండా జారిపోవడంతో పాటు ఆకస్మికంగా భారీస్థాయిలో వరద జలాలు జారిపడుతుండడంతో ఆ సమయంలో ఉన్నవారెవరైనా వాగులోకి జారి కొట్టుకుపోవడం ఖాయంగా మారింది. ఈ ప్రాంతాల్లో జలపాతాలు ప్రమాదభరితంగా ఉన్నాయని తెలిసినా ఎవరూ జలపాతాల వైపు రావద్దని అధికారులు నిరోధించడం లేదు. అంతేకాదు ప్రమాదభరితంగా ఉన్నాయన్న సంకేతాలను కూడా అక్కడ ప్రదర్శించలేదు. పాములేరులో కూడా మొసళ్లు ఉన్నాయని ప్రమాద హెచ్చరికలు చేస్తున్నారేతప్ప వాగు ప్రమాదభరితంగా ఉందని మాత్రం ఎవరూ చెప్పడం లేదు. పింజరికొండ విషయంలో అయితే ఎటువంటి హెచ్చరికలూ ఉండవు. సీతపల్లిలో స్థానికులు వారించినా పర్యాటకులు ఆగడం లేదు. ప్రభుత్వం ఇకనైనా ఇక్కడి పర్యాటకంపై దృష్టిసారించాల్సి ఉంది. పర్యాటక ప్రాంతాల అభివృద్ధితోపాటు పర్యాటకుల రక్షణ బాధ్యత కూడా పూర్తిస్థాయిలో చేపడితేనే ఇలాంటి ఘటనలకు ఆస్కారం ఉండదు. మన్యంలో పర్యాటకంలో వాగుల్లో, జలపాతాల్లో స్నానాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టి, కేవలం వీక్షణకే పరిమితం చేయాలని పలువురు కోరుతున్నారు.

మన్యంలోని జలపాతాలు, కొండవాగులు పర్యాటకులను ఎంతగా ఆకట్టుకుంటున్నాయో అంతకుమించి పర్యాటకులను మింగేసే మృత్యుకుహరాలుగా మారాయి. ఈ పర్యాటక కేంద్రాల్లో సరైన భద్రత, రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో పర్యాటకులను తరచూ బలితీసుకుంటున్నాయి. ఆదివారం నాడు మారేడుమిల్లి మండలం అటవీశాఖ నిర్వహిస్తున్న జలతరంగిణి జలపాతంలో ఇద్దరు మెడికోలు మృతి చెందగా, మరొక విద్యార్థి గల్లంతైన ఘటన నేపథ్యంలో మన్యం విహార కేంద్రాల రక్షణ చర్చనీయాంశంగా మారింది.



భవిష్యత్ తరాలకు మంచి వైద్య సేవలు అందించే వైద్యురాలిగా నా బిడ్డను చూడాలనుకున్నాను. కానీ ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. **రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద అమృత తండ్రి బాలి శ్రీనివాసరావు ఆవేదన**



తలకు బలమైన గాయాలు కావడంతో చివరిసారిగా ముఖం చూసేందుకు కూడా అవకాశం లేదు. ఈ దుర్ఘటన గురించి తెలిసిన తర్వాత సౌమ్య తల్లిదండ్రులు అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యారు.

సౌమ్య మేనమామ మచ్చ ఆదినారాయణ

కుమారుడు హరదీప్ అచూకీ తెలియకపోవడంతో కొండవాగుల వద్ద ఆందోళనగా తండ్రి రవి ప్రసన్న



మెడికోలను చిదిమేసిన జలఖడ్గం

- కొండ రాళ్ల తాకిడికే మృత్యువాత
- ఒకరి తలకు, నుదిటికి తీవ్ర గాయాలు
- మరొకరి ముఖం ఛిద్రం
- జలతరంగిణి సృష్టించిన విలయం
- ఏడడుగుల ఎత్తులో ప్రవాహం
- ఇప్పటికీ కురుస్తున్న వర్షం
- ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు లభ్యం
- మరొక విద్యార్థి కోసం గాలింపు
- రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు



మారేడుమిల్లి, సెప్టెంబరు 23: ఆనందంలో మునిగితేలుతున్న ఆ క్షణాలు.. వారికి చివరి క్షణాలయ్యాయి. వైద్య విద్యతో ఒకరికి ప్రాణదానం చేయాల్సిన వీరిని మృత్యువు.. క్షణాల్లో విగతజీవులుగా మార్చేసింది. నిజానికి ప్రకృతి సోయగాలకు అసలైన అందం జలపాతాలే. కొండకోనల్లోంచి పొంగిపొర్లుకుంటూ వాగుల్లోకి వచ్చే దృశ్యాలను వీక్షించేవారు కొందరైతే, పచ్చని ప్రకృతి ఒడిలోంచి వడివడిగా వస్తున్న ఆ చల్లని జలాల్లో ఈదులాడాలని ఉరకలెత్తేవారు కొందరు. ఆ తహతహే కొందరిని మృత్యువు తన ఒడిలోకి లాగేసుకుంటోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పర్యాటక ప్రాంతానికి ఆదివారం ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు విచ్చేశారు. మారేడుమిల్లి జలతరంగిణి జలపాతంలో ఐదుగురు కొట్టుకుపోగా వీరిలో గాయత్రి పుష్ప, చింతా హరిణి ప్రియ గాయాలతో బయటపడిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు చెందిన బృందాలు మొత్తం 40 మంది ఆదివారం సాయంత్రం నుంచి మిగిలిన ముగ్గురి కోసం తీవ్ర స్థాయిలో గాలించాయి. రెవెన్యూ, అగ్నిమాపక, అటవీ అధికారుల సమన్వయంతో నిరంతరాయంగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఆదివారం అర్ధరాత్రి విజయనగరం జిల్లా బొబ్బిలి సమీపంలోని డొంకినవలస గ్రామానికి చెందిన బాలి అమృత (22) మృతదేహాన్ని కనుగొన్నారు. సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో బొబ్బిలికి చెందిన కొసిరెడ్డి సౌమ్య(21) మృతదేహాన్ని కనుగొన్నారు. మరొక విద్యార్థి ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన చింతకుంట్ల హరదీప్(20) ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సోమవారం రాత్రి వరకు గాలింపు చర్యలు కొనసాగించాయి. రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, డీఎఫ్‌వో బబిత, మారేడుమిల్లి సీఐ సీహెచ్ మురళీకృష్ణ, తహసీల్దారు కారం సుబ్బారావు గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

ఎంత ఘోరం..

మెడికోలు ఆదివారం మధ్యాహ్నం ఒకటిన్నర-రెండు గంటల మధ్య ఇక్కడ స్నానాలకు దిగారు. అప్పటికే వర్షం మొదలైంది. దీనికితోడు కొండల్లోంచి భారీగా వరదనీరు ముంచెత్తింది. ఒక ఉప్పెన మాదిరిగా విలయతాండవం చేస్తూ ఒక్కసారిగా జలతరంగిణి భయోత్పాతం సృష్టించింది. మొత్తం 14 మంది మెడికోలకుగాను ఐదుగురు చిక్కుకుపోయారు. వీరిలో ఒకరు ఏదోలా బయటపడగా, మరొకరిని సమీపంలో కాజ్‌వే వద్ద రక్షించారు. ఇక మిగిలిన వారిలో అమృత మృతదేహం జలతరంగిణి నుంచి కొట్టుకుపోయి ఒకటవ కాజ్‌వే దాటిన తర్వాత ఇసుక దిబ్బ వద్ద లభ్యమైంది. ప్రవాహ వేగానికి రాళ్లకు కొట్టుకుపోవడంతో నుదుటి మీద, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షణాల్లోనే మృతి చెందినట్టు భావిస్తున్నారు. అలాగే సౌమ్య మృతదేహం కూడా అదే ప్రాంతంలోని తుప్పల్లో చిక్కుకుపోయింది. సౌమ్యకు తీవ్ర గాయాలు కావడంతో పాటు ముఖం ఛిద్రమైంది. రాళ్ల దెబ్బలకు తగిన గాయాలకే ఆమె కూడా మృతి చెంది ఉండొచ్చని తెలుస్తోంది. జలఖడ్గంలా వచ్చిన పడిన ప్రవాహం అరగంటలో వర్షం తగ్గగా, కొద్దిసేపటికే కొంత తగ్గుముఖం పట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో ప్రవాహం మొదటి కాజ్‌వే ప్రాంతంలో ఏకంగా ఏడడుగులుపైనే ఉంటుందని చెబుతున్నారు. మళ్లీ సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా వర్షం కురవడంతో జలతరంగిణి వద్ద ఒక్కసారిగా జలప్రవాహం పెరిగిపోయింది. దాంతో గాలింపు చర్యలను సైతం నిలిపివేయాల్సి వచ్చింది. సాయంత్రం వర్షం తగ్గాక మరొక విద్యార్థి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. జలతరంగిణి నుంచి పాములేరు వాగు వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. వాగు వంపులు తిరుగుతూ వెళుతుంది. దాంతో ప్రవాహ వేగాన్ని దృష్టిలో పెట్టుకుని గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. రెండో కాజ్‌వే వద్ద తూముల్లో కూడా గాలించారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా
జడ్పీ సీఈవోగా లక్ష్మణరావు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 23: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా వీవీ వీఎస్ లక్ష్మణరావు నియమితులయ్యారు. డ్వామా విజయనగరం జిల్లా గరివిడి క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇంత వరకు ఇన్‌చార్జి సీఈవోగా పనిచేసిన కాకినాడ డీఎల్‌డీవో పి.నారాయణమూర్తి విశాఖపట్నం జిల్లా జడ్పీ సీఈవోగా బదిలీ అయ్యారు.

జడ్పీలో పారదర్శంగా అంతర్గత బదిలీలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 23: జీవో నెం.75 మార్గదర్శకాలను అనుసరించి ఉమ్మడి జిల్లా జడ్పీలో పారదర్శకంగా అంతర్గత బదిలీలు చేపట్టామని జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. అంతర్గత బదిలీ అయిన జడ్పీ ఉద్యోగులకు సోమవారం తన చాంబర్‌లో ఆయన ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ ఇన్‌చార్జి సీఈవో పి.నారాయణమూర్తి, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. ఎంపీడీవోలు 28 మంది, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 40 మంది, సీనియర్ అసిస్టెంట్లు 61 మంది, జూనియర్ అసిస్టెంట్లు 91 మంది, టైపిస్టులు 41 మంది, రికార్డు అసిస్టెంట్లు 26 మంది, డ్రైవర్లు ఇద్దరు, ఓఎస్‌లు 67మంది, ఎల్‌జీఎస్‌లు నలుగురు.. మొత్తం 360 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.

చిరుత పులి కదలికలు లేవు

డీఎఫ్‌వో భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23: తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా చిరుతపులి కదలికలను ఏమీ గుర్తించలేదని జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివాన్‌చెరువు రక్షిత అటవీ ప్రాంతం, చుట్టుపక్కల ప్రాంతాల్లో 105 ట్రాప్ కెమెరాలు, 10 సీసీ కెమెరాలు, ఏడు ట్రాప్ బోనులను ఏర్పాటు చేశామన్నారు. అటవీ శాఖ బృందాలతో నిత్యం గాలిస్తున్నప్పటికీ ఈ నెల 20 నుంచి చిరుతపులి కదలికలు కెమెరాల్లో కనిపించలేదని స్పష్టం చేశారు. దివాన్ చెరువు రక్షిత అటవీ ప్రాంతం చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి కూడా చిరుత కదలికలపై ఏ విధమైన సమాచారం రాలేదన్నారు. చిరుతపులి కదలికలను గుర్తించే ప్రక్రియను కొనసాగిస్తూనే ఉన్నామని డీఎఫ్‌వో చెప్పారు.

4.5 కిలోల గంజాయి స్వాధీనం
ముగ్గురు అరెస్టు

మోతుగూడెం, సెప్టెంబరు 23: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సీలేరు వైపు నుంచి డొంకరాయి వస్తున్న మహీంద్ర జైలో కారును ఆపి తనిఖీ చేశారు. అందులో రూ.23వేలు విలువైన 4.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న కృష్ణా జిల్లాకు చెందిన తలారి మణికంఠ, లంకపల్లి మధుకుమార్, ఏలూరు జిల్లాకు చెందిన వడ్డాది మున్నిలను అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కారుతో పాటు రెండు మొబైల్స్ సీజ్ చేశారు.

సత్యదేవుని సన్నిధిలో శాంతి హోమం



శాంతి హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, సెప్టెంబరు 23: తిరుమలలో కల్తీ నెయ్యి వినియోగంపై అపరాధ నివారణ కోసం దేవదాయ శాఖ ఆదేశాలతో సోమవారం అన్నవరం దేవస్థానం పండితులు, అర్చకులు శాంతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. వనదుర్గ ఆలయం వద్ద ఉదయం తొమ్మిది గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, మంటపారాధన జరిపి దేశ సుభిక్షం, లోక కల్యాణార్థం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. 11 గంటలకు హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు వైదిక కార్యక్రమాలు నిర్వహించగా పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో గణపతి తదితరులు పాల్గొన్నారు.

యువత జీవితంలో క్రీడలు భాగం కావాలి: మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 23: యువత జీవితంలో చదువుతో పాటు క్రీడలు భాగం కావాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో గరిగిపాటి జానకిరామయ్య స్మారక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్స్ బాలురు, బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలాలు లేవన్నారు. కొన్నిచోట్ల కమర్షియల్ కాంప్లెక్సుల్లో పాఠశాలలు నిర్వహిస్తున్నారన్నారు. నేటి తరం పిల్లలు ఆటలకు సమయం కేటాయించకపోవడంతో చిన్నతనంలోనే పలు రుగ్మతలకు గురవుతున్నారన్నారు. తొలుత గరిగిపాటి జానకిరామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి బాస్కెట్‌బాల్ ఆడారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 14 బాలురు జట్లు, 8 బాలికల జట్లు పోటీలకు హాజరైనట్టు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గన్నమని చక్రవర్తి తెలిపారు. వీరిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో జిల్లా జట్లు ఎంపిక చేస్తామన్నారు. జిల్లా స్థాయి జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సంపతి సత్యనారాయణ పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

కాకినాడ జీజీహెచ్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 23: మహిళల్లో గర్భాశయ, రొమ్ము తదితర క్యాన్సర్లు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లోని గైనకాలజీ ఓపీడీ, ఎస్‌ఆర్‌ఎంటీ విభాగం వద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం ఏర్పాటు చేశారు. సోమవారం దీనిని పీఐఎస్‌సీసీ ప్రెసిడెంట్ జీన్‌టాల్బర్ట్ ఫాకోగ్, లీడ్ ఇండియన్ ఆపరేషన్స్ డాక్టర్ సమత కడియాలతో కలిసి కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్‌ను నివారించే లక్ష్యంతో జీజీహెచ్‌లోని ప్రసూతి, గైనకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ-గ్లోబల్ (పీఐఎన్‌సీసీ) విభాగం సంయుక్తంగా ఈ స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న మహిళా సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్క్రీనింగ్ పరీక్షలకు హాజరయ్యే మహిళలు నెంబరుకు 8885253889 వాట్సప్ లేదా rorm-ckkd@gmail.com మెయిల్ ఐడీకి తమ వివరాలు పంపించి నమోదు చేసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి కోరారు. కార్యక్రమంలో విశాఖపట్నం హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి రీసెర్చ్ సెంటర్ హెచ్‌వోడీ డోలోరెసా ఫెర్నాండెజ్, అమెరికల్ కాలేజ్ ప్రసూతి, గైనకాలజిస్ట్ డాక్టర్ సుసాన్ కోక్రాన్, డాక్టర్ కరోల్ హాబాచ్, జీజీహెచ్ రేడియేషన్ ఆంకాలజీ, ఓబీజీ విభాగాల హెచ్‌వోడీలు డాక్టర్ పి.శ్రీనివాసన్, డాక్టర్ అనురాగమయి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ రుక్మిణి పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

పులిపిరి(సురిడికాయ)కి అరుదైన చికిత్స

- ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు

కాకినాడ జిల్లా, సెప్టెంబర్ 23: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కాకినాడ మెయిన్ రోడ్, చందనాబ్రదర్స్ ఎదురుగా, జయరాం హీరో షోరూమ్ ప్రక్కన, హోటల్ శ్రీవాత్స, కాకినాడ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 23, 24, 25,తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. మంగళ, బుధవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులో సంప్రదించాలన్నారు.



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

నేడు పశ్చిమ మండల ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరం ఎంపికలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం పశ్చిమ మండల ఎన్‌ఎస్‌ఎస్‌ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరం ఎంపికలు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో 290 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఉన్నాయన్నారు. వీటి నుంచి హాజరయ్యే వారు ఎంపికల్లో సత్తా చాటాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధికారుల పర్యవేక్షణలో వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులైన వారిని ఎంపిక చేస్తారని తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలు తమ తమ యూనిట్లలో ప్రతిభావంతులైన వలంటీర్లను ఎంపిక చేసి సెలక్షన్స్‌కు తీసుకు రావాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు, వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు సంయుక్తంగా ఎంపిక ప్రక్రియ పూర్తిచేయాలని శ్రీనివాసరావు కోరారు.

రేపు 'నన్నయ'లో ప్రాంగణ ఎంపికలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌లో ఉద్యోగాలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రాంగణ ఎంపికలు జరుగుతాయని ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. 2023-24లో ఎమ్మెస్సీ ఆర్గానిక్, అనలిటికల్ కెమిస్ట్రీ, బీఎస్సీ మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీలో 60శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యా సంవత్సరంలో ఎటువంటి గ్యాప్‌లేని మహిళా అభ్యర్థులకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. అనలిటికల్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగంలో ఉద్యోగాలకు నిర్వహిస్తున్న ఈ ప్రాంగణ ఎంపికలను విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఎంపికైన వారికి అప్రెంటీస్ ట్రైనీ హోదాతో పాటు నెలకు రూ17,500 నుంచి 21,500 వరకు స్టైఫండ్ ఇస్తారు. 25వ తేదీ ఉదయం 10 గంటలకు నన్నయ వర్శిటీ సెమినార్ హాల్లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అశ్విని ఎంపిక

అనపర్తి, సెప్టెంబరు 23: స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఇటీవల కాకినాడలో జరిగిన యోగా అండర్-19 పోటీల్లో అనపర్తి బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అశ్విని విశేష ప్రతిభ కనబరిచింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ రాజేశ్వరి తెలిపారు. విద్యార్థినిని సోమవారం పీఈటీతో పాటు హెచ్‌ఎం కళ్యాణి, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.



మోటారు సైకిల్‌ను ఢీకొన్న లారీ

భార్య మృతి, భర్తకు గాయాలు... ఎర్రకోనేరు వద్ద ఘటన

బంధువుల ఇంటికి పరామర్శకు వెళ్లొస్తుండగా ప్రమాదం

తుని రూరల్, సెప్టెంబరు 23: కాకినాడ జిల్లా తుని రూరల్ పరిధిలోని 16వ నెంబరు జాతీయ రహదారి ఎర్రకోనేరు సెంటర్లో సోమవారం జరిగిన ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన పల్లి ఆదిలక్ష్మి (48) భర్త వెంకట్రావుతో కలిసి ఎస్.అన్నవరం గ్రామంలో బంధువులు ఇంటికి పరామర్శకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో వారి మోటారు సైకిల్‌ను ఎర్రకోనేరు వద్ద లారీ ఢీకొట్టింది. లారీ చక్రంలో ఇరుక్కున్న ఆదిలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. ఎగిరి రోడ్డు పక్కన పడ్డ భర్తని 108 అంబులెన్సులో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్ఐ కృష్ణమాచారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ తప్పించుకుపోయే ప్రయత్నం చేయగా పోలీసులు చాకచక్యంగా వెంబడించి పట్టుకున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.



ఆదిలక్ష్మి (పాత చిత్రం)



ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులు

టీటీ పోటీల్లో 'శ్రీప్రకాష్' విద్యార్థులకు పతకాలు

పెద్దాపురం, సెప్టెంబరు 23: కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో మూడు రోజులు జరిగిన సీబీఎస్‌ఈ క్లస్టర్-7 టేబుల్ టెన్నిస్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. అక్టోబరులో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. విజేతలను కోచ్‌లు వేణు, శ్రీరామ్, పాఠశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి సమీర, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ఆకడమిక్ కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

అండర్-14 బాలికల విభాగంలో నయన కొల్లి (కెప్టెన్), గీతాంజలి భైరవి, బాలుర విభాగంలో టి.సాయిశర్వణ్ (కెప్టెన్), ఎ.సృజన్, వేద్ తివారి, అభిక్ భట్టాచార్య, అండర్-17 బాలుర విభాగంలో డి.ప్రహర్ష (కెప్టెన్), వెంకయ్యనాయుడు, గీతేష్, ఆయుష్మాన్ కాంస్య పతకాలు సాధించారు.

అండర్-17 బాలికల విభాగంలో ఎ.శాంతిజ్యోతి (కెప్టెన్), మౌపర్ణదాస్, సీహెచ్ సాయిశ్రుతి, డి.నిషితసాయి, అండర్-19 బాలికల విభాగంలో టి.సాయిసుదీక్ష (కెప్టెన్), ఎం.దర్శిక, ధరణీ శ్రీకార్తికేయ, జాన్ రెజినా, బాలుర విభాగంలో పి.అశ్విన్, సీహెచ్ విజయ్‌ధర్, టీఎస్ఎస్ విఖ్యాత్, ఎం.వెంకటధనుష్ స్వర్ణ పతకాలు సాధించారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర

మౌలిక వసతులు కల్పించండి

నీతి అయోగ్ సమావేశంలో వై.రామవరం ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం, సెప్టెంబరు 23: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వై.రామవరం మండలం పూర్తిగా వెనుకబడి ఉందని, రహదారులు వేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని వై.రామవరం ఎంపీడీవో బాపన్నదొర విజ్ఞప్తి చేశారు. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి వై.రామవరం మండలాన్ని నీతి అయోగ్ బృందం గుర్తించింది. వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర మాట్లాడుతూ తమ మండలంలో అనేక లోతట్టు గ్రామాలున్నాయన్నారు. 50 గ్రామాలకు మాత్రమే రహదారులున్నాయని, 90 గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేవన్నారు. ఆయా గ్రామాల్లో ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న రోగులకు నేటికీ డోలీమోతలు తప్పడం లేదని, వాటి నుంచి విముక్తి కల్పించాలని కోరారు. గిరిజన గ్రామాల్లో విద్యా వసతులు, టెలికమ్యూనికేషన్, వ్యవసాయాభివృద్ధి, కరెంటు సౌకర్యాలను ఎంపీడీవో ప్రతిపాదించారు. మండలాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలని విన్నవించారు. సంపూర్ణత పోషణ అభియాన్‌పై గ్రామసభలు పెట్టి గిరిజనుల్లో చైతన్యం కల్పిస్తున్నామని బాపన్నదొర వివరించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కూటమి నాయకులు

జాతీయ టీ10 క్రికెట్ పోటీలకు ఎంపిక

బిక్కవోలు, సెప్టెంబరు 23: జాతీయ స్థాయి టీ10 క్రికెట్ పోటీలకు తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్టు హెచ్‌ఎం కేవీ రాఘవులు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీ10 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయన్నారు. ఇందులో అరుగురు విద్యార్థులు పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారు. పదో తరగతి చదువుతున్న ఎస్‌కే సమీర్, జి.ఈనోష్, పి.శివసాయి, డి.దుర్గాప్రసాద్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అండర్-17 విభాగంలో జాతీయ స్థాయి టీ10 పోటీలకు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెల 21వ తేదీ నుంచి మహారాష్ట్రంలోని నాసిక్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. విజేతలను, వారిని తీర్చిదిద్దిన పీడీ ఎండీ జావిద్‌కరిముద్దీన్‌ను కూటమి నేత నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ బర్ల శ్రీనివాస్ అభినందించారు.

దోమల నిర్మూలనతో జ్వరాల వ్యాప్తి తగ్గుదల

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 23: దోమల నిర్మూలన ద్వారా జ్వరాల వ్యాప్తి తగ్గుతుందని.. డెంగ్యూ, మలేరియా జ్వరాలు సోకవని కాకినాడ మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసరు వై.డానియేలు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని బీసీ బాలుర, బాలికల వసతి గృహాల్లో దోమల నిర్మూలన మందును సోమవారం పిచికారీ చేశారు. కార్యక్రమంలో చేబ్రోలు పీహెచ్‌సీ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 23: కార్మిక వ్యతిరేక 4లేబర్ కోడ్లు రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు కాకినాడ హెడ్‌పోస్టాఫీసు వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ డే ఆందోళన నిర్వహించారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2020 సెప్టెంబరు 22న చీకటిరోజు సందర్భంగా సోమవారం ఈ ఆందోళన జరిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్లూరి వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, నగర కోకన్వీనర్ పలివెల వీరబాబు, రూరల్ కన్వీనర్ రాజా, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

'ప్రతీ సమస్యను సత్వరం పరిష్కరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 23: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతీ సమస్యను సత్వరం పరిష్కరించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను కమిషనర్ భావన నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజనీరింగ్, ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి 11 మంది ఫోన్ ద్వారా సమస్యలు విన్నవించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో పలువురు వినతులు అందజేశారు.

'విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్రం కుట్రలు'

పెద్దాపురం, సెప్టెంబరు 23: విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పులిమేరు గ్రామంలో ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి గుండెలాంటి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. ప్రైవేటీకరణ ఆపాలని గత 1315 రోజులుగా విశాఖ నగరం, రాష్ట్రంలోను కార్మికులు, ప్రజాసంఘాలు పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. రైతుకూలీ సంఘం నేతలు బి.రమేష్, భూషణం, నారాయణ, నాగేశ్వరరావు, అన్నవరం, మహాలక్ష్మీ, సత్యనారాయణ, అర్జున ఉన్నారు.

'పారిశుధ్య కార్మికులకు అండగా ఉంటాం'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 23: పారిశుధ్య కార్మికులకు అన్నివిధాలా అండగా ఉంటామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు చెప్పారు. నియోజకవర్గ పారిశుధ్య కార్మికుల కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య మైకేల్ సోమవారం ప్రారంభించారు. ప్రధాని మోదీ జన్మదిన పక్షోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో పారిశుధ్య కార్మికులకు రొట్టెలు, వాటర్ బాటిల్స్‌ను బీజేపీ నేతలు వెంకట్రావు, సింగిలిదేవ్ సత్తిరాజు, ఊటా వీరబాబు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు రామకుర్తి సూర్యనారాయణ, ఊటా భాస్కర్, దొంతంశెట్టి చంద్రశేఖర్, పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

జగ్గంపేట, సెప్టెంబరు 23: స్థానిక అగ్నిమాపక కేంద్రం ఎదురుగా ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మండల పరిషత్ నిధులు రూ.10లక్షలు వెచ్చించి కోనేటి వీధిలో గల ఎస్‌వీఎస్ అప్పలరాజు ఇంటి ఎదురుగా ఉన్న పాత మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాలను సుందరంగా తీర్చిదిద్ది వంటగది, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు స్టోర్‌రూం వసతులు ఏర్పాటు చేసి ప్రారంభించారు. విద్యార్థులకు నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ప్లాస్టిక్ చాపలను అందించారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, బచ్చల సుధీర్ గదులను ప్రారంభించారు. బీజేపీ ఇన్‌చార్జ్ దాట్ల కృష్ణవర్మ, వేములకొండ జోగారావు పాల్గొన్నారు.

బయోకెమిస్ట్రీ ఎనలైజర్ ప్రారంభం

కాకినాడ రూరల్, సెప్టెంబరు 23: అత్యాధునిక పరికరాలతో మెరుగైన వైద్యపరీక్షలు ద్వారా పేదలకు సేవలను డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌లో అందిస్తున్నారని కేఎస్‌పీఎల్ సీవోవో మెర్ల మురళీధర్ అన్నారు. కేఎస్‌పీఎల్ ఎండీ కేవీరావు సహకారంతో యూపీఎస్‌పీఎల్ చైర్మన్ జయదేవ్ సమకూర్చిన రూ.5లక్షల విలువైన పుల్లీ ఆటోమేటెడ్ బయోకెమిస్ట్రీ ఎనలైజర్‌ను సోమవారం మురళీధర్ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. దీని ద్వారా రక్తపరీక్షలను వేగవంతంగా, మెరుగైన ఫలితాలతో ఎక్కువ మందికి సేవలందించవచ్చన్నారు. ట్రస్ట్ చైర్మన్ బాదం బాలకృష్ణ, యూపీఎస్‌పీఎల్ జీఎం మూర్తి, చుండ్రు గోవిందరాజు, మంజులూరి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కరప సొసైటీలో అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కరప, సెప్టెంబరు 23: కరప సొసైటీలో అక్రమాలు జరిగాయంటూ పలువురు రైతులు సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. సంఘ భవనం చుట్టూ నిర్మించిన ప్రహరీగోడ, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని.. చేసిన ఖర్చుకు, పూర్తయిన పనికి పొంతన లేదని పేర్కొన్నారు. గత పీఏసీ చైర్మన్, సీఈవోలు సంఘ భవనం నిర్మాణంలో అవకతవకలకు పాల్పడ్డారని రైతులు బేరి రామకృష్ణ, సుబ్బరాజు ఆరోపించారు. దీనిపై రైతుల సమక్షంలో సమగ్ర విచారణ జరపాలని, దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు.

ఏపీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గం ఎన్నిక

కిర్లంపూడి, సెప్టెంబరు 23: ఏపీయూడబ్ల్యూజే కిర్లంపూడి మండల నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. నియోజకవర్గ అధ్యక్షుడు అడపా వెంకటరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలాధ్యక్షుడిగా గండే కొండారావు(నాని), ఉపాధ్యక్షుడిగా ముద్రగడ రమేష్‌కుమార్, కార్యదర్శిగా టి.కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నేదూరి లక్ష్మణరావు, సహాయకార్యదర్శి నేదూరి చినబాబు, జిల్లా కోశాధికారి వెలిది వెంకటరత్నం, అడపా శ్రీనివాస్, జగ్గంపేట, గండేపల్లి మండలాధ్యక్షులు చిక్కాల మణికంఠ, ఎన్టీవీ సూరిబాబు అభినందించారు.

పెళ్లి కానుక అందజేత

కిర్లంపూడి, సెప్టెంబరు 23: మండలంలోని వీరవరం గ్రామానికి చెందిన కాకర మణిబాబు, మాణిక్యం దంపతుల కుమార్తె స్నేహకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా రూ.20వేలు పెళ్లికానుక చెక్‌ను సోమవారం కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అందజేశారు. నవీన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పెళ్లికాబోయే యువతుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వారం రోజులు ముందుగా ఫౌండేషన్ వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, గొల్లపల్లి సూరిబాబు ఉన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలని ధర్నా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 23: కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, బ్లాక్ మార్కెట్ అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం కాకినాడ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యుడు మలక వెంకటరమణ, సీపీఎం నగర కమిటీ సభ్యురాలు కె.నాగజ్యోతి, యూనియన్ల నాయకులు సీహెచ్ రాజ్‌కుమార్, మేడిశెట్టి వెంకటరమణ, టి.రాజా, ఎం.హరనాథ్, వి.చంద్రరావు, టి.రాణి పాల్గొన్నారు.

స్రవంతికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 23: కాకినాడ-సామర్లకోట రోడ్డులో గల ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌సైన్స్ గణితశాస్త్ర అధ్యాపకురాలు ఏసీహెచ్ స్రవంతి కేంద్రప్రభుత్వం నీతి అయోగ్ సంస్థ అనుబంధంగా ఉన్న కౌన్సిల్ ఫర్ స్కిల్స్ కాంపిటెన్సీస్ (సీఎస్‌సీ) నుంచి ఈ ఏడాదికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ తెలిపారు. స్రవంతిని కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, అధ్యాపకులు స్టీవెన్‌రాజు, నాగేశ్వరరావు, స్వామీజీ, కిరణ్, ప్రసాద్, వైఆర్‌ఎల్ అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

కరాటే పోటీల్లో యండమూరు విద్యార్థినుల ప్రతిభ

కరప, సెప్టెంబరు 23: జిల్లాలో ఈనెల 22న జరిగిన ఫస్ట్ ఏపీ స్టేట్ ఇన్విటేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2024 ఎల్లో బెల్ట్ కేటగిరీలో కరప మండలం యండమూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యారినులు సత్తా చాటారు. పాఠశాలలో 4వ తరగతి విద్యార్థిని యు.విజ్ఞశ్రీ, 5వ తరగతి విద్యార్థిని పి.హన్సిక ఈ పోటీల్లో స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నట్టు కరాటే మాస్టర్ యు.లోవరాజు తెలిపారు. సర్పంచ్ మారెళ్ల శివ, పాఠశాల హెచ్‌ఎం కె.సరస్వతి, ఎస్‌ఎంసీ చైర్మన్ పి.శ్రీనివాసు, వైస్‌చైర్మన్ యు.సరోజినిలు విద్యార్థినులను, తర్ఫీదునిచ్చిన మాస్టర్ లోవరాజును అభినందించారు.

ఎమ్మెల్యే నానాజీకి ఎస్సీ నాయకుల సంఘీభావం

కరప, సెప్టెంబరు 23: గొడారిగుంటలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సోమవారం చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు కరప మండల ఎస్సీ నాయకులు మద్దతు తెలిపారు. మండల ఎస్సీ నాయకుడు పురం సత్యప్రసాదరావుతో పలువురు దీక్షా శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపారు. ఎస్సీ నాయకులు జెల్లా శివకుమార్, జార్జిరాజు, మెండు గోవిందు, అశోక్, శ్రీనివాస్, సింహాచలం, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులో భారీ అన్నవితరణ

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 23: వినాయక చవితి నవరాత్రులు ముగింపు సందర్భంగా గాంధీనగర్‌లోని రైతుబజారులో రైతులు, వ్యాపారులు భారీ అన్నవితరణ నిర్వహించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, వై.శివ, అప్పారావు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాలకు మేలు

» తుని ఎమ్మెల్యే యనమల దివ్య » పలుచోట్ల ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు





తునిరూరల్: కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య, పెద్దాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజప్ప

తుని రూరల్, సెప్టెంబరు 23: కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తుని మండలంలో తిమ్మాపురం, వెంకటాపురం గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. 100 రోజుల పాలనలో మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్లు, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, సకాలంలో ఉద్యోగులకు జీతాలు వంటి కార్యక్రమాలతో సంక్షోభంలోను సంక్షేమం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, కొయ్యశ్రీనుబాబు, సుర్ల లోవరాజు, యూనిగంటి సత్యనారాయణ, గజ్జి అప్పలరాజు, అత్తి అచ్యుతరావు, పప్పు నవీన్, కలగా శ్రీనుబాబు, ఖాతా గోవిందు తదితరులు ఉన్నారు.

కోటనందూరు: మండలంలో ఇండిగబిల్లి, ఎస్ ఆర్‌పేట, అప్పలరాజుపేటలలో ఎమ్మెల్యే యనమల దివ్య ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ప్రజలకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యనమల రాజేష్, గోర్లు అచ్చియ్యనాయుడు, రమేష్, షేక్ నవాబ్, మోతుకూరి వెంకటేష్, వెలగా వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: పి.అగ్రహారం గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే యనమల దివ్య మాట్లాడారు. టీడీపీ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, కొయ్యా రామకేశవ, కోడవెంకట రమణ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ అద్భుత పాలన

పెద్దాపురం, సెప్టెంబరు 23: ఆర్థిక సంక్షోభంలోనూ అద్భుత పాలన అందించడం ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. మొదటి 100 రోజుల పాలనలోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు నమ్మేలా పాలన అందిస్తున్నారన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని రాజప్ప ప్రారంభించారు. పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు బోళ్ల వెంకటమణ, తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, సూరిబాబురాజు, కాకినాడ రామారావు పాల్గొన్నారు. మండలంలోని దివిలి గ్రామంలో టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), కాండ్రకోటలో గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు.

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం

శంఖవరం, సెప్టెంబరు 23: ఆర్థిక కష్టాలు అధిగమించి రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం అందిస్తుందని ఎమ్మెల్యే సత్యప్రభ పేర్కొన్నారు. మండలంలో పెద్దమల్లాపురం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదికను జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ కార్యక్రమాలను గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో పర్వత సురేష్, బద్ది రామారావు, కీర్తి వెంకటసుబాష్, ఉల్లి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అంతా మంచే జరుగుతుంది

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 23: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అంతా మంచే జరుగుతుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం మండలం పి.తిమ్మాపురం, రాపర్తి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని 100రోజుల్లో ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, మాజీ జడ్పీటీసీ బర్ల అప్పారావు, వెన్నా గోపి, బర్ల అప్పన్న, రొంగల తాతబాబు, బొడ్డు వెంకట నాగేశ్వరరావు ఉన్నారు.

పలు గ్రామాల్లో...

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం, ఏలూరు గ్రామాల్లో గత 100 రోజుల్లో సీఎం చంద్రబాబు అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై టీడీపీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, రామిరెడ్డి ప్రసాద్, బొల్లు వెంకటేశ్వరరావు, ఏలూరు సర్పంచ్ రొంగల సత్యనారాయణ, అడ్డాల త్రిమూర్తులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పి.మల్లవరంలో ప్రతీ ఇంటింటికీ తిరిగి టీడీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ వివరించారు. గాడిమొగ పంచాయతీ పెదవలసల, చినవలసల గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

జగన్ వల్లే టిడ్కో అపార్ట్‌మెంట్ వాసులకు కష్టాలు : వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 23: వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ అవలంబించిన దుర్మార్గపు వైఖరి వల్లే టిడ్కో అపార్ట్‌మెంటు వాసులకు కష్టాలు వచ్చాయని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పట్టణంలోని గోర్స రోడ్డులో ఎన్‌టీఆర్ టిడ్కో అపార్ట్‌మెంట్ వాసులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులు వివరించడమే గాకుండా టిడ్కో అపార్ట్‌మెంట్లు ప్రాంగణంలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు తదితర సమస్యలను 15రోజుల్లోగా పరిష్కరించే విధంగా పనులు చేపడతామని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా ఇక్కడ పార్కు, ఆసుపత్రి, పాఠశాల, వాటర్ ట్యాంకు ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు. అపార్ట్‌మెంట్ వాసులకు రేషన్ ఇక్కడే ఇచ్చేలా చూస్తామని వర్మ తెలిపారు. మున్సిపల్ కమిషనరు కనకారావు, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు ఉన్నారు.

మడ అడవుల సందర్శన



మడ అడవులను సందర్శించిన విద్యార్థులు

తాళ్లరేవు, సెప్టెంబరు 23: హైదరాబాద్‌కు చెందిన ఫారెస్ట్ కళాశాల /రీసెర్చ్ విద్యార్థులు కోరింగ అభయారణ్యంలో మడ అడవులను సోమవారం సందర్శించారు. వైల్డ్‌లైఫ్‌రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో ములుగు, సిద్దిపేటకు చెందిన రీసెర్చ్ విద్యార్థులు చొల్లంగిని సందర్శించి అడఅడవులు ప్రాముఖ్యత, చేపట్టే అభివృద్ధి పనులను తెలుసుకున్నారు. ఎఫ్‌బీవోలు మహేష్, సంధ్యారాణి, ధనలక్ష్మి, మధుబాబు సిబ్బంది పాల్గొన్నారు.

తాను చనిపోతూ.. కొందరికి ఊపిరి

కుమారుడి అవయవదానానికి తల్లిదండ్రుల అంగీకారం



శ్రీమురహరి (ఫైల్)

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 23: తాను చనిపోతూ తన అవయవాలతో కొందరికి ఊపిరి పోశాడో విద్యార్థి. పుట్టెడు దుఃఖంలో సైతం కుమారుడి అవయవదానానికి అంగీకరించి.. తల్లిదండ్రులు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం తోకలపూడికి చెందిన పోలిశెట్టి రేవంత్ శ్రీమురహరి(19), మరో యువకుడితో కలిసి విశాఖపట్నంలో పరీక్ష రాయడానికి వెళ్తూ కాకినాడ జిల్లా తుని మండలం యర్రవరం వద్ద ఈ నెల 21న ప్రమాదంలో గాయపడ్డారు. అతడిని కాకినాడ అపోలో ఆస్పత్రికి తరలించారు. డిపార్ట్‌మెంట్ చీఫ్ డాక్టర్ ఎంవీ కిరణ్‌కుమార్, న్యూరాలజిస్టు డాక్టర్ శివరామగాంధీ వైద్య చికిత్స అందించినప్పటికీ బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. అనంతరం తల్లిదండ్రులు నాగపుష్ప, సుబ్రహ్మణ్యానికి అవయవదానంపై అవగాహన కల్పించడంతో ఇందుకు సమ్మతించారు. వెంటనే కిడ్నీలు, లివర్ దానం కోసం జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేయడంతో ఒక కిడ్నీని కాకినాడ అపోలో ఆస్పత్రికి, మరో కిడ్నీని విశాఖపట్నం కేర్ ఆస్పత్రికి, లివర్‌ను షీలానగర్ కిమ్స్ ఆస్పత్రికి కేటాయించారు. కాకినాడ అపోలో హాస్పిటల్స్‌లో ఆర్గాన్ హార్వెస్టింగ్ చేయడానికి నిర్ణయించారు. ఇక్కడి నుంచి అవయవాలు తరలించేందుకు కాకినాడ జిల్లా ఎస్పీ సహకారం తీసుకున్నారు. కళ్లను బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం ఇచ్చారు. ఈ అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలు ప్రముఖ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ జీవీ రావు ఆధ్వర్యంలో యూరోలాజిస్టులు డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ జంజ్యం మణికంఠన్, నెఫ్రోలోజిస్ట్ డాక్టర్ చట్లపల్లి అనిల్‌కుమార్, అనస్తేషియా వైద్యులు ప్రగడ నాగేశ్వరరావు, శర్మిష్ట ప్రాణిగ్రాహి టీం సహకారంతో నిర్వహించారు.

పవన్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం



గండేపల్లి: ఉప్పలపాడులో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నవారితో తుమ్మలపల్లి రమేష్

గండేపల్లి, సెప్టెంబరు 23: తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో లడ్డూ ప్రసాదంలో జరిగిన తప్పునకు ప్రాయశ్చిత్తంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా సోమవారం గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. గండేపల్లి జనసేన నాయకులు మేడిబోయిన శ్రీను గణపతి హోమాలు, లలితా పారాయణం జరిపించారు. తుమ్మలపల్లి మాట్లాడుతూ తిరుమల లడ్డూకు ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వు కలిపి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని, దీనికి కారణమైన మాజీ సీఎం జగన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేడిబోయిన శ్రీనుబ్రదర్స్, అంకం ఓం, సత్తి సోమరాజు, సూరంపాలెం బాలు, మాదారపు వీరబాబు, మొగిలి గంగాధర్, దొడ్డ శ్రీను, కాయల మణికంఠ, రేపూరి శ్రీనివాస్, బచ్చుల రాజు, వీరబాబు, పితాని వీరబాబు ఉన్నారు.

పిఠాపురంలో...

పిఠాపురం: తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో లడ్డూ ప్రసాదంలో జరిగిన తప్పునకు ప్రాయశ్చిత్తంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు సంఘీభావంగా పిఠాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన నేతలు ప్రాయశ్చిత్త దీక్ష నిర్వహించారు. జనసేన, బీజేపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్ చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, బుర్రా కృష్ణంరాజులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొని సంఘీభావం తెలిపారు.

గొల్లప్రోలులో...

గొల్లప్రోలు: పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా గొల్లప్రోలు వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పూజలు నిర్వహించారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడటం వల్ల జరిగిన అపచారానికి క్షమాపణలు వేడుకున్నారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

విరవాడలో రాస్తారోకో

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 23: తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూను అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విరవాడ గ్రామంలో కూటమి నేతలు ప్రదర్శన జరిపి ప్రధాన కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. దోషులను శిక్షించి, భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడకుండా కఠినంగా వ్యవహరించాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు కోలా చిన్న, రాజు, కూరాకుల రాంబాబు, కందా శేషగిరి, నాగబాబు, జవ్వాది ప్రసాద్, దిబిడి కృష్ణ, కొమ్మిరెడ్డి నరేష్ తదితరులున్నారు.

అఖండ దీప పాదయాత్ర

పిఠాపురం, సెప్టెంబరు 23: పట్టణంలోని పాదగయ క్షేత్రం నుంచి తిరుమల వరకూ శ్రీ తార వారాహి లోక కల్యాణార్థ సేవా భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం రాత్రి ప్రారంభమైంది. తిరుమల వరకు జరగనున్న తారా వారాహి నిత్యమః అఖండ దీప పాదయాత్రను ట్రస్టు ఫౌండర్ బచ్చు అవినాష్ దేవిచంద్ర ప్రారంభించారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించిన పాపం పోవాలంటే నిత్య అఖండ దీపం తిరుమల చేరాలన్నారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లకు పూజ చేసి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు.



పిఠాపురం నుంచి తిరుమలకు అఖండదీప పాదయాత్రకు అంకురార్పణ చేస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరం

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 23: మండలంలోని జె.కొత్తూరులో స్వచ్ఛతా హీ కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విచ్చేసి ప్రారంభించారు. ఈ నెల 24,25,26న కాకినాడ జీజీహెచ్‌లో దేశ విదేశాల నుంచి క్యాన్సర్‌కు సంబంధించిన స్పెషలిస్టులు వస్తున్నారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణీత్, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ మాధురి, ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, చల్లా రామ్మూర్తి, అడపా తాతాజీ, తదితరులున్నారు.

క్రీడా పోటీలు

పిఠాపురం, సెప్టెంబరు 23: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పిఠాపురం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు పిఠాపురం మండలం చిత్రాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాలు చెందిన జట్లు వివిధ క్రీడల్లో తలపడ్డాయి. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా నియోజకవర్గ స్థాయి క్రీడా జట్లును ఎంపిక చేస్తారు. ఈ పోటీలను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు బియ్యం దొంగలు అరెస్ట్

రూ.4.50 లక్షల విలువైన 500 బస్తాలు స్వాధీనం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 23: బియ్యం బస్తాలు చోరీకి పాల్పడుతున్న ముగ్గురు నిందితులను సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.4.50 లక్షల విలువైన 500 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్టు సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు తెలిపారు. కాకినాడ డెయిరీఫారమ్ సెంటర్ టెంట్‌హౌస్ సమీపంలో గల పట్నాల వంశీరెడ్డి, షేక్ అహ్మద్ అలీ, జగన్నాథపురం గోళీలపేటకు చెందిన అనసూరి దుర్గాలు బియ్యం బస్తాల చోరీకి పాల్పడుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ఎన్‌జేవీ భాస్కరరావు పర్యవేక్షణలో ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు ఆధ్వర్యంలో సర్పవరం సీఐ పెద్దిరాజు ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు చేపట్టారు. నిందితులు సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో కొండేలుపేట శివారులో ఉండగా అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి సుమారు 500 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.4.50 లక్షలని సీఐ తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో ప్రత్యేక కృషి చేసిన సీఐ పెద్దిరాజు, ఎస్ఐ కె.రామకృష్ణమూర్తి, హెచ్‌సీలు సత్తిబాబు, రాజు, గణేష్, పీసీ వెంకటరత్నాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు.

వరద బాధితులకు విరాళం

కొత్తపల్లి, సెప్టెంబరు 23: వరద బాధితుల కోసం కొత్తపల్లికి చెందిన వీవీఎస్ పబ్లిక్ స్కూల్ చిన్నారులు గ్రామాల్లో జోలె పట్టి రూ.లక్ష విరాళం సేకరించి సోమవారం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు అందజేయగా అభినందించారు.టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి ఉన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

గొల్లప్రోలు, సెప్టెంబరు 23: పట్టణంలోని కరణంగారితోట వరద బాధితులకు లాతూర్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు నిత్యావసర సరుకులు.. వృద్ధులు, మహిళలు, పారిశుధ్య కార్మికులకు సరుకులతో కూడిన కిట్లును పంపిణీ చేశారు. మురళీ , కరణంగారితోట యువత పాల్గొన్నారు.

పిఠాపురం ఎస్ఐగా మణికుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న మణికుమార్

పిఠాపురం, సెప్టెంబరు 23: పిఠాపురం పట్టణ ఎస్ఐగా బి.మణికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంద్రపాలెం ఎస్ఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఎస్ఐగా పనిచేసిన మురళీమోహన్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

ముగిసిన కాటన్ గైడ్ ట్రైనింగ్

తుని రూరల్, సెప్టెంబరు 23: స్కౌట్ అండ్ గైడ్‌తో ఉత్తమ విద్యార్థులు తయారవుతారని స్కౌట్ అండ్ గైడ్ రాష్ట్ర ట్రైనింగ్ కమిషనర్ మోహన్‌రావు తెలిపారు. డీఈవో పి.రమేష్ ఆదేశాలతో తుని మండలం దొండవాక ప్రభుత్వ పాఠశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న కాటన్ గైడ్ ట్రైనింగ్ ముగింపు సోమవారం జరిగింది. పరిసర ప్రాంతాల పాఠశాలల నుంచి సుమారు 30 మంది ఉపాధ్యాయులు గైడ్ కెప్టెన్లుగా శిక్షణ తీసుకుని ఆయా పాఠశాలలకు యూనిట్ల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్లు చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, నారాయణ, ఎ.త్రిపుర దేవి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

దసరా మహోత్సవాలకు శ్రీకారం

ఏలేశ్వరం, సెప్టెంబరు 23: పట్టణంలో దసరా మహోత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. లింగవరం కాలనీలో జెవీఆర్ ట్రస్ట్ చైర్మన్ జువ్విన వీర్రాజు వీర్రాఘవమ్మ దంపతులు ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి కొబ్బరికాయ కొట్టి రాట ముహూర్తం చేశారు. భక్తులకు తంబూలాలు, ప్రసాదాలు అందజేశారు. కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, పైల విజయ్ కుమార్, గట్టిం పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

పిఠాపురం, సెప్టెంబరు 23: పట్టణంలోని రథాలపేట సెంటర్‌లో అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు ఆవరణలో పారిశుధ్య కార్మికుల కోసం సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పురపాలకసంఘాల్లో పనిచేస్తున్న కార్మికులందరికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు కనకారావు, ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యాధికారి సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు

తొండంగి, సెప్టెంబరు 23: మండలంలో విద్యార్థులకు ఒంటిమామిడి దివిస్ ఫార్మా కంపెనీ నోటు పుస్తకాలను అందించింది. సోమవారం ఒంటిమామిడి ప్రాథమిక పాఠశాలలో సంస్థ ప్రతినిధులు 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు అందించారు. దానవాయపేట, ఒంటిమామిడి, కృష్ణాపురం, తొండంగి, శృంగవృక్షం, కోదాడ తదితర గ్రామాల్లోని 760 మంది విద్యార్థులకు లక్షా54 వేల విలువైన నోటు పుస్తకాలను అందించామని సంస్థ ప్రతినిధులు సత్యవేణి, ఫణితేజ చెప్పారు.

మరిడమ్మ దేవస్థానం ఏసీ బదిలీ

పెద్దాపురం, సెప్టెంబరు 23: పెద్దాపురం మరిడమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం హితకారిణి సమాజం అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.విజయలక్ష్మీ ఇక్కడకు ఏసీగా రానున్నారు. ఈనెల 24వ తేదీన విజయలక్ష్మీ బాధ్యతలు చేపట్టనున్నారు. రామ్మోహనరావు అన్నవరం దేవస్థానం ఏసీగా బదిలీ అయ్యారు.

'ఆదిత్య'లో అవగాహన సదస్సు

గండేపల్లి, సెప్టెంబరు 23: సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విభాగంలో మైక్రో సర్వీసెస్, నిజసమయంలో వాటిని అమలు చేసే విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. టెక్నికల్ ఆర్కిటెక్ ఎన్.కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్ డాక్టర్ పి.రవికుమార్, డాక్టర్ బి.కిరణ్‌కుమార్ ఉన్నారు.

నేటి నుంచి ఎలుకల నివారణ మందు పంపిణీ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 23: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం ఉచితంగా ఎలుకల నివారణ మందు పంపిణీ చేయనున్నట్టు ఏవో వైవీ.గంగాధర్ తెలిపారు. బ్రో మోడైనాల్ మందును అందజేస్తామని, రైతులు నూనె,నూకలు తెచ్చుకుంటే మందు కలిపి ఇస్తామన్నారు. వరి, ఇతర పంటల్లో ఎలకల నివారణకు రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

కోటనందూరు, సెప్టెంబరు 23: తుని డివిజన్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్టు ఏడిఏ సుంకర బుల్లిబాబు తెలిపారు. సంబంధిత పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే దివ్య చేతులమీదుగా ఆవిష్కరించారు. మండలంలో ఎస్‌ఆర్‌పేట నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి అబ్బాయి, వెలగా రాము పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి, సెప్టెంబరు 23: కొత్తపల్లి విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నిర్వాహణ నిమిత్తం మంగళవారం వాకతిప్ప, ఉప్పాడసెంటర్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పెద్దాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అల్లంరాజు ప్రభాకర్ తెలిపారు. వాకతిప్పలో తహశీల్దార్ కార్యాలయం వెనుక, సతీష్‌చంద్ర కాలనీలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉప్పాడ సెంటర్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రంగనాగ్ పరామర్శ

సామర్లకోట, సెప్టెంబరు 23: ఇటీవల తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న హుస్సేన్‌పురం గ్రామ టీడీపీ దళిత నాయకులు తలారీ శ్రీనువాసు, ముప్పిడి వెంకటరమణలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ సోమవారం పరామర్శించారు. గ్రామ టీడీపీ నాయకుడు చల్లా బుజ్జి, కోట అప్పారావు కార్యకర్తలు ఉన్నారు.

భారీ వర్షం



సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపు నీరు

సామర్లకోట, సెప్టెంబరు 23: పట్టణంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీతో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ లో 4 అడుగుల ఎత్తున మురుగునీరు చేరింది.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో మధ్యాహ్నం గంటపాటు వర్షం కురిసింది. ఈ వర్షం ఖరీఫ్ వ్యవసాయ సాగుకు ఎంతో మేలు కలుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

పెట్రోల్ బంకులో విజిలెన్స్ తనిఖీలు

సామర్లకోట, సెప్టెంబరు 23: సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో సామర్లకోట శివారున గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో రాజమహేంద్రవరం విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం రాత్రి అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పూరిస్థాయి నివేదికలు తదుపరి చర్య నిమిత్తం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదించి చర్యలు తీసుకోనున్నట్టు విజిలెన్స్ డీఎస్పీ తాతారావు తెలిపారు.